సాక్షి
అనంతపురం
బుధవారం ǀ 12 ǀ జూలై ǀ 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



తుంగభద్రకు పెరిగిన ఇన్‌ఫ్లో

ఎగువన కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద చేరుతోంది. మంగళవారం 17.761 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 5.419 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
35.6°/22.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడ్డాయి.

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటన ఖరారు



వీసీతో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

అనంతపురం: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 16, 17 తేదీల్లో అనంతపురంలో పర్యటించనున్నారు. విజయనగర లా కళాశాలలో ఈ నెల 16న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. 17న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో మంగళవారం ఎస్కేయూలో జరుగుతున్న ఏర్పాట్లను వీసీ ప్రొఫెసర్ ఎం.రామకృష్ణారెడ్డి, కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. అంతకుముందు విజయనగర లా కళాశాలలోనూ ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గవర్నర్ రాకపై ఎస్కేయూ వీసీ అధికారిక నివాసంలో అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సమావేశమయ్యారు. గవర్నర్ పర్యటనకు సంబంధించిన వివరాలను ఎంపీ ఆరా తీశారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయండి




ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: మద్యం, ఇసుక, గంజాయి అక్రమ సరఫరా కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లాలోని సెబ్ విభాగం అధికారులతో మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులు అరెస్టు కాని గంజాయి, ఇతర రాష్ట్రాల లిక్కర్, నాటుసారా, గేమింగ్ కేసులపై లోతుగా సమీక్షించారు. కేసుల ఛేదింపు పెరగాలన్నారు. సరిహద్దు స్టేషన్ల పరిధిలో నిఘా పటిష్టం చేయాలన్నారు. నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, సెబ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విధుల్లో మంచి పనితీరు కనబరిచిన సెబ్ సీఐలు నాగేంద్ర ప్రసాద్, నరసానాయుడు, సెబ్ విభాగం సిబ్బంది మురళి, రామచంద్ర, రమేష్, నారాయణస్వామి, మారుతిలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఫ్లైఓవర్‌పై బస్సులకు గ్రీన్ సిగ్నల్

అనంతపురం సెంట్రల్: నగరంలో నూతనంగా నిర్మించిన క్లాక్‌టవర్–పీటీసీ ఫ్లైఓవర్‌పై బస్సుల రాకపోకలకు పోలీసు శాఖ అనుమతిచ్చిందని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. అనంతపురం నుంచి బళ్లారి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ బస్సులు ఇక నుంచి శ్రీకంఠం సర్కిల్, ఆర్ట్స్ కళాశాల, క్లాక్‌టవర్ ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు. చార్జీలను కూడా తగ్గించి నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల, పీటీసీ స్టాపింగ్‌ల వద్ద మాత్రమే బస్సులు నిలుపుతారని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

పలు రైళ్లు పాక్షికంగా రద్దు



గుంతకల్లు: తిరుపతి రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరిదేవరపల్లి – తిరుపతి (07590) స్పెషల్ ప్యాసింజర్ రైలును ఆగస్టు 10 వరకు, తిరుపతి–గుంతకల్లు (07656) స్పెషల్ ప్యాసింజర్ రైలును ఆగస్టు 11 వరకు పాకాల – తిరుపతి మధ్య రద్దు చేశారు. ఇక తిరుపతి–హుబ్లీ–తిరుపతి (07657/58) స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఆగస్టు 10 వరకు రేణిగుంట–తిరుపతి మధ్య రద్దు చేసినట్లు వివరించారు. దీంతో పాటు తిరుపతి జంక్షన్ మీదుగా ప్రయాణించే మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్లు పేర్కొన్నారు.

ఐదో తరగతి ప్రవేశానికి నేడు కౌన్సెలింగ్

అనంతపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు సంబంధించి మిగిలిన సీట్లకు బుధవారం కురుగుంట గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ మంగళవారం తెలిపారు.

సరిలేరు మీకెవ్వరు!

- వలంటీర్ల సేవలు అద్భుతం
- విపత్తు వేళ భయపడని నైజం



ఇంటి ముందు మంచంపై దిగాలుగా కూర్చున్న వృద్ధుని పేరు గొల్ల గంగన్న. ఈయనది కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామం. ఆరేళ్ల క్రితం నరాల బలహీనతతో కంటిచూపు కోల్పోయాడు. భార్య లక్ష్మీదేవి పదేళ్ల క్రితమే చనిపోయింది. అప్పటి నుంచి బంధువుల సంరక్షణలో జీవనం సాగిస్తున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ సుధామణి తాతా అంటూ వృద్ధుని వద్దకెళ్లి రూ.3వేల పింఛన్ అందజేస్తోంది. నా లాంటి కళ్లులేని, నడవలేని వారిని ఆదుకునేందుకు సీఎం జగన్ దేవుడిలా వలంటీర్‌ను పంపించాడంటూ ఆనందం వ్యక్తం చేస్తుంటాడు.



ఇతని పేరు సందు మియా. కదిరి సమీపంలోని పట్నం గ్రామం. భార్య 15 ఏళ్ల క్రితమే చనిపోయింది. పిల్లలు లేరు. చిన్న గదిలో నివాసం ఉంటున్నాడు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌తో చాలా ఇబ్బందులు పడ్డాడు. కనీసం తిండిలేక అల్లాడిపోయాడు. సందుమియా గురించి తెలుసుకున్న గ్రామ వలంటీర్ నాగేంద్ర నేరుగా అతని వద్దకు వెళ్లాడు. బాగోగులు ఆరా తీసి నిత్యావసరాలు అందించాడు. ప్రాణభయంతో జనమంతా ఇళ్లకే పరిమితమైన సమయంలోనూ వలంటీర్ నాగేంద్ర తనను వెతుక్కుంటూ వచ్చి నిత్యావసరాలు అందజేయడంతో సందుమియా కన్నీళ్లతో నాగేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.



అనంతపురం వార్డు సచివాలయం–18 పరిధిలో ఇద్దరు వ్యక్తులు కోవిడ్‌తో మరణించారు. జనం బయటకు రావాలంటే వణికిపోయే పరిస్థితి. అటువంటి పరిస్థితుల్లో వలంటీర్ ద్వారకనాథ్ ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగాడు. వయసు పైబడిన తండ్రి (వికలాంగుడు), అమ్మ, భార్య, బిడ్డ, చెల్లెలకు ఏమవుతుందోనని ఆలోచించలేదు. కోవిడ్ బాధితులకు అవసరమైన సేవలందించారు. రోజూ రాత్రి పూట మిద్దెపైనే పడుకుని, తన దుస్తులు తనే ఉతుక్కునేవాడు.

సాక్షి నెట్‌వర్క్ : ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సు లేకుండా నేరుగా అర్హుల ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారు. 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి.. ఆయా కుటుంబాలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునుంచే వలంటీర్లు తలుపు తట్టి లబ్ధిదారులకు ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నారు. బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించి సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించి మంజూరు చేయిస్తున్నారు. డీలర్ వద్ద పడిగాపులు కాయకుండా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందుకునే విధంగా సమాచారం అందిస్తున్నారు. వ్యాక్సినేషన్, ఆరోగ్య పరీక్షల సమాచారం చేరవేసి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. తాగునీరు, కాలువల్లో



యాడికి ఎస్సీ కాలనీలో వైద్యసిబ్బందితో కలిసి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

పూడిక, వీధిలైట్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే నవరత్నాల పథకాలు, చేపట్టే కార్యక్రమాల గురించి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వివరిస్తున్నారు. అంతేకాదు కరోనా, వరదలు వంటి విపత్తుల వేళ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించి ప్రశంసలూ అందుకున్నారు. సేవల్లో వలంటీర్లు నవశకానికి నాంది పలికారు. అలాంటి వారిని నీచ రాజకీయాల్లోకి లాగడం.. ప్రజా సేవకులపై పవన్‌కళ్యాణ్ నోరుపారుసుకోవడాన్ని జనం తప్పుపడుతున్నారు.

వెతుక్కుంటూ వెళ్లి కానుక అందజేత



పుట్టపర్తికి చెందిన వెంకటరాముడు జబ్బుతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో మూడు నెలలుగా చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య సైతం ఆయనకు తోడుగా ఉంటోంది. పైగా డబ్బు అవసరం బాగా ఉంది. వీరి గురించి తెలుసుకున్న వలంటీర్ గౌతమి సొంత ఖర్చుతో అనంతపురానికి వెళ్లి మూడు నెలల పాటు 'వైఎస్సార్ పింఛన్ కానుక' అందజేసింది.

వలంటీర్ దేవుడు



మాది పెద్ద కుటుంబం. 18 మంది సభ్యులం. కరోనా సమయంలో సగం మందికి పైగా ఆ జబ్బుతో బాధపడ్డాం. ప్రాణాలు నిలుపుకునేందుకు అష్టకష్టాలు పడ్డాం. అయినా మా అత్త భీమనపల్లి సావిత్రమ్మను పోగొట్టుకున్నాం. కరోనా తీవ్రతను చూసి మా ఇంటివైపు ఎవ్వరూ రాలేదు. అయినవారు, స్థానికులు ఎవ్వరూ ధైర్యం చేయలేదు. నరకం అనుభవించాం. కుటుంబ పెద్ద అయిన దివాకర్ అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వార్డు వలంటీర్ కూనె వెంకటేశులు ప్రాణాలను ఫణంగా పెట్టి నెలరోజులపాటు మా ఇంటికి సేవలందించి.. కంటికి రెప్పలా మమ్మల్ని చూసుకున్నాడు. దేవుడిలా ఆదుకున్నాడు.

– నాగవేణి, ఒకటో వార్డు కౌన్సిలర్, రాయదుర్గం

కుటుంబ సభ్యుడిలా చూసుకుంటున్నాం



మేము ఏడుగురు అన్నదమ్ములం. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. మిగిలిన వారు పౌరోహిత్యం చేసుకుంటూ జీవిస్తున్నాం. విపత్తు వేళ నలుగురం కోవిడ్ బారిన పడ్డాం. మా కుటుంబాన్ని అధికారులు హోం క్వారంటైన్ చేశారు. యాడికి -1 సచివాలయం వలంటీర్ కిరణ్‌కుమార్ రోజూ మా కుటుంబాన్ని సందర్శించి యోగక్షేమాలపై ఆరా తీసేవాడు. నిత్యావసరాలు అందిస్తూ.. ఆరోగ్య పరీక్షలు చేయిస్తుండేవాడు. చుట్టూ ఉన్న వారు భయపడిపోతున్నా వలంటీర్ మాత్రం ధైర్యంగా వచ్చి మాకు సపర్యలు చేశాడు. వలంటీర్‌ను మేము కుటుంబ సభ్యుడిగా చూసుకుంటున్నాం.

– జనార్దనశర్మ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కోటవీధి, యాడికి

జిల్లాలో..

వార్డు సచివాలయాలు	180
గృహాలు	2,02,718
జనాభా	6,43,529
వార్డు వలంటీర్లు	2,869
గ్రామ సచివాలయాలు	483
గృహాలు	5,35,204
జనాభా	16,42,444
గ్రామ వలంటీర్లు	8,268



దివ్యాంగునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

దోపిడీ.. దగాకోరు చరిత్ర మీది

- జేసీ ప్రభాకర్‌రెడ్డిపై తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్
- మా నాయకుడికి క్షమాపణ చెప్తే నీ కొడుకును ఎమ్మెల్యే చేస్తా

అనంతపురం టవర్‌క్లాక్: మీ పూర్వీకులది, మీది దోపిడీ, దగాకోరుల చరిత్ర అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారం ఆయన అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మీడియాతో మాట్లాడారు. ప్రభాకర్‌రెడ్డి తమ కుటుంబం గురించి నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని, తాను అందరిలాంటి రాజకీయ నాయకుడిని కాదని, ఉనికికి ఇబ్బంది కలుగుతుందనుకుంటే ఎంతదూరం వెళ్లడానికైనా సిద్ధమని హెచ్చరించారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన పిల్లలను తప్పుపట్టడం సరికాదన్నారు. మీ కుటుంబం, మీ పూర్వీకులు దొంగతనాలు చేసే బతికారని, తాడిపత్రికి వచ్చిన కొత్తలో ఎన్ని దొంగతనాలు చేశారో చరిత్ర చెబుతుందని అన్నారు. మీపైన ఎన్ని సారా కేసులు ఉన్నాయో ఎక్సైజ్ కార్యాలయానికి వెళితే తెలుస్తాయన్నారు. మద్యం షాపుల వద్ద మీరు చెనిక్కాయలు అమ్మిన రోజులు మరిచిపోయారా అని గుర్తు చేశారు. తమది వ్యవసాయ కుటుంబమని, తాము రాజకీయం చేస్తే స్నేహపూర్వకంగా ఉంటుందని, ఎవరికీ అన్యాయాలు, అక్రమాలు చేయలేదని స్పష్టం చేశారు. తాము ఎస్సీలకు సంబంధించి అర సెంటు భూమి కూడా తీసుకోలేదని, ఏమైనా లాక్కున్నట్లు నిరూపిస్తే మీకే వదిలేస్తామని చెప్పారు. ఎవరు పరువులు వేసిందీ జిల్లా ప్రజలందరికీ తెలుసన్నారు. నీ కొడుకును ఎమ్మెల్యే చేయడం కోసం చేస్తున్న దిగజారుడు రాజకీయాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. చేసిన తప్పులు ఒప్పుకుని, తమ నాయకుడు వైఎస్ జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

మోహన్‌రెడ్డికి క్షమాపణ చెప్పి.. వైఎస్సార్‌సీపీలోకి వస్తే తాము అండగా ఉండి నీ కొడుకును ఎమ్మెల్యేగా గెలిపిస్తామని బంపర్ ఆఫర్ ఇచ్చారు. మా నాయకుడు ఒప్పుకోకపోతే మేమే తప్పుకుని నీ కొడుకును ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకుంటామన్నారు.

పాడె ఎవరు ఎక్కుతారో తెలుస్తుంది

తన అన్న హత్య కేసును కోర్టు కొట్టేసిందని, తామేమీ రాజీ పడలేదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. ఇప్పుడు తమను హత్య చేయాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆలోచన కనుక చేస్తే.. ఎవరికోసం అయితే ఆయన ఆస్తులు సంపాదిస్తున్నాడో వారికి ఆ ఆస్తులు కూడా లేకుండా పోతాయని హెచ్చరించారు. తమను పాడెపై పడుకోబెడతామని అంటున్నారని, 2024 ఎన్నికల తరువాత ఎవరు పాడెపై ఉండేదీ తెలుస్తుందని అన్నారు. ఇప్పటికే జేసీ సోదరుల్లో ఒకరికి 74 ఏళ్లు, మరొకరికి 83 ఏళ్లు ఉన్నాయని, మరి ఎవరు ముందు పాడె ఎక్కుతారో త్వరలోనే తేలుతుందన్నారు. బీఎస్–4 వాహనాల కేసులో ప్రధాన నిందితుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, ఆయనను జేసీ వారే చంపారని తాము ఎన్నడూ వివర్శలు చేయలేదని, అలాంటి దిగజారుడు రాజకీయాలకు తాము దూరమని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణేదీ?

- ఐసీడీఎస్ అధికారులపై కలెక్టర్ గౌతమి ఆగ్రహం

అనంతపురం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడిందని కలెక్టర్ గౌతమి ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యాన్ని సహించేది లేదన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, సేవలపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. ఐసీడీఎస్, అనుబంధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సిబ్బంది నియామకాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రగతి, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు నమోదు, నూతన భవనాల నిర్మాణం పురోగతి, పాత భవనాల మరమ్మతుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రికార్డుల పరిశీలన, పౌష్టికాహార పంపిణీ, భవనాల నిర్మాణం, మరమ్మతుల తదితర వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. పౌష్టికాహార పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 30లోగా నాడు– నేడు కింద చేపట్టిన భవన నిర్మాణ పనులు, మరమ్మతులు పూర్తి చేయించాలని చెప్పారు. బడి ఈడు పిల్లలు ఎవరూ బయట ఉండకూడదని, వందశాతం బడిలో చేర్పించాలని ఆదేశించారు. ప్రతి నెలా కో–ఆర్డినేటర్ల పనితీరుపై సీడీపీఓలు సమీక్షించి నివేదిక పంపించేలా చూడాలని పీడీ శ్రీదేవిని ఆదేశించారు. అంగన్‌వాడీలకు అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీఓ సుబ్రమణ్యం, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

రిజిస్ట్రేషన్‌లో అవినీతి జలగలు


- తిలాపాపం తలా పిడికెడు
- రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో తవ్వేకొద్దీ అక్రమాలు
- సత్యనారాయణమూర్తి డైరీలో పంపకాల చిట్టా
- గుంతకల్లు, అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచే కీలకపాత్ర
- అవినీతి నిరోధక శాఖ అధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి

నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలవాల్సిన రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన రుసుము మాత్రమే స్వీకరించి సేవలందించాలి. కానీ కొందరు అధికారులు లంచాలకు అలవాటు పడ్డారు. అధికారిని చూసుకుని కిందిస్థాయి ఉద్యోగులూ చిలక్కొట్టుడు కొడుతున్నారు. రుసుము చెల్లించి సేవలు పొందాలనుకునే వారికి డాక్యుమెంట్ రైటర్లు లేదా కార్యాలయ సిబ్బంది 'ఖర్చవుతుంది' అనే మాట చెబుతారు. ఖర్చు పెట్టు కుంటే ఫైలు ముందుకు.. లేకుంటే కొర్రీలతో పెండింగ్. అలా మొదలైన అవినీతి ఇంతింతై వటుడింతై అన్న చందంగా కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పంపకాల స్థాయికి చేరింది. ఈ వ్యవహారం అవినీతి నిరోధక శాఖ విచారణలో వెలుగుచూసింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం : జిల్లాలో రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ వ్యవహారం కీలక మలుపులు తిరుగుతోంది. నెలన్నర వ్యవధిలోనే ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు సస్పెండ్ కావడం, మరికొంతమందిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిఘా పెట్టడం చూస్తుంటే భారీగా లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది. తాజాగా అనంతపురం అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రూ.1.30 లక్షలు లంచం తీసుకుంటూ జాయింట్–1 సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తితో సహా డాక్యుమెంట్ రైటర్, అతడి అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. విచారణలో పలు కీలక విషయాలు బయటికి వస్తున్నాయి.

డైరీలో దిమ్మ తిరిగే సమాచారం

ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయిన సత్యనారాయణమూర్తి రాసుకున్న డైరీ ఇప్పుడు కీలకంగా మారింది. రిజిస్ట్రేషన్ శాఖలో ఎవరికి ఎంత వాటాలు ఇచ్చిందీ అందులో స్పష్టంగా రాశారు. ఈ డైరీని



ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మూర్తి గతంలో అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సస్పెండ్ అయి వైఎస్సార్ జిల్లా పుల్లంపేటకు బదిలీ అయ్యారు. కానీ కొంత కాలానికే తిరిగి అనంతపురం అర్బన్ కార్యాలయానికి వచ్చారు. దీనికోసం ఆయన ఒక ఉన్నతాధికారికి రూ.25 లక్షలు ఇచ్చినట్టు డైరీలో రాసుకున్నారు. అంతేకాకుండా నెలవారీగా డిపార్ట్‌మెంటుకు ఎంత వస్తోంది, ఎవరికి ఎంత ఇస్తున్నారన్న విషయాలు స్పష్టంగా తేదీల వారీగా స్వదస్తూరీతో అందులో లిఖించారు. రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా ఉన్నతాధికారికి నెలకు రూ.5 లక్షలు ఇస్తున్నట్టుగా అందులో రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సత్యనారాయణమూర్తి డైరీలో జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ పేర్లు కూడా ఉన్నాయని ఓ అధికారి చెప్పారు.

జిల్లా ఉన్నతాధికారికి మామూళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 17 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నిటినుంచి జిల్లా ఉన్నతాధికారికి మామూళ్లు ఇవ్వాల్సిందే. ఉదాహరణకు కణేకల్లు కార్యాలయానికి ఒకరేటు ఉంటే.. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మరో రేటు ఉంటుంది. అత్యధికంగా రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వెళుతోంది. నిర్ణయించిన మేరకు ఇవ్వకపోతే వారిపై ఏదో ఒక రకంగా వేటు వేసే పరిస్థితి. టార్గెట్ల కారణంగానే సబ్‌రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఒకరిద్దరు సబ్‌రిజిస్ట్రార్లను ఫోన్‌లో సంప్రదించగా.. మేము కూడా పైన ఇచ్చుకోవాలి కదా అని చెబుతున్నారంటే అవినీతి ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం సత్యనారాయణమూర్తి డైరీని ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఆ ఇద్దరే వసూళ్లలో కీలకం

ఉన్నతాధికారులకు వసూళ్లు చేసి ఇవ్వడంలో గుంతకల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారి ఒకరు, అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఒకరు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. నెలవారీ అన్ని కార్యాలయాల నుంచి వసూళ్లు చేసి ఉన్నతాధికారికి ఇస్తారు. డీఐజీ కార్యాలయంలో ఒక వ్యక్తికి అందజేసేవారని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇవన్నీ చాలా గుట్టుగా జరుగుతున్నట్టు 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. ఈ విషయంపైనా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. వసూళ్లలో కీలక పాత్ర పోషించిన ఒకరికి ఇప్పుడు సబ్‌రిజిస్ట్రార్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. మరో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఏసీబీ నిఘాలో ఉన్నారు.

తేలికపాటికే పరిమితమైన 'నైరుతి'



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు ఇంకా ప్రభావం చూపలేదు. రోజూ మేఘాలు ఆవరిస్తున్నా గాలివేగానికి చెదిరిపోతున్నాయి. ఒకట్రెండు మండలాలు మినహా ఎక్కడా మంచి వర్షం నమోదు కాలేదు. తేలికపాటికే పరిమితం కావడంతో ఖరీఫ్ పంటలు మందకొడిగా సాగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సాగుకు అనుకూలంగా ఉన్నా... మంచి వర్షాలు వస్తే సాధ్యమైనంత తొందరగా 'ముంగారు'ను ముగించడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ ఖరీఫ్‌లో 3,70,642 హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేశారు. అయితే ఇప్పటికింకా 10 శాతం అంటే 40 వేల హెక్టార్ల విస్తీర్ణంలోనే పంటలు సాగు చేశారు.

పత్తి సాగు అధికం

తాడిపత్రి డివిజన్ పరిధిలో పదును వర్షం కురవడంతో పత్తి సాగు అధికంగా నమోదైంది. పత్తి సాధారణ సాగు 51,612 హెక్టార్లు కాగా ఇప్పటికే 22 వేల హెక్టార్లలో విత్తుకున్నారు. వేరుశనగ 2.31 లక్షల హెక్టార్లకు గాను 12 వేల హెక్టారజ్బలో విత్తుకున్నారు. వర్షాలు ఆలస్యమైతే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టినట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మ 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న రాజగోపాలనాయుడు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన అనంతపురంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రాజగోపాలనాయుడుకు, చిన్నాన్న పెద్ద చంద్రశేఖరనాయుడు మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు రామ్‌నగర్‌లోని బ్రిడ్జి కింద వేచి ఉన్న రాజగోపాలనాయుడిపై చంద్రశేఖర నాయుడు కత్తితో దాడి చేసి, ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజగోపాల నాయుడిని స్థానికులు వెంటనే ఆటోలో సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: మండల కేంద్రం వజ్రకరూరులో వెలసిన జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను 'సహాయ కమిషనర్, డోర్.నం.1-40-609, రెండవ ఫ్లోర్, హెచ్చెల్సీ కాలనీ, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలని సూచించారు.

కష్టం విన్నారు... ఆదుకున్నారు







ఈ నెల 8న సీఎం వైఎస్ జగన్‌కు తన కష్టం చెప్పుకుంటున్న కల్పన, కలెక్టర్ చేతుల మీదుగా రూ.2 లక్షల చెక్కు అందుకుంటున్న దృశ్యం, నక్కలపల్లిలో చిన్నారులకు చెక్కులను అందజేస్తున్న బెళుగుప్ప తహసీల్దార్ ఓబులేసు

అనంతపురం అర్బన్/ఉరవకొండ: ప్రజల కష్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విన్నారు వెంటనే ఆదుకున్నారు. ఈ నెల 8వ తేదీ కళ్యాణదుర్గం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి హెలీప్యాడ్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆ సమయంలో పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చొరవతో ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల గ్రామానికి చెందిన గంగేలి కల్పన సీఎంను కలసి తన కష్టాన్ని చెప్పుకుంది. తన భర్త సిద్దయ్య గుండె జబ్బుతో మరణించాడని... ఇంటి పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నామని... తమ కుటుంబానికి అండగా నిలవాలని విలపించింది. ఆమె కష్టానికి చలించిన సీఎం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ ఎం.గౌతమిని ఆదేశించారు. దీంతో కలెక్టర్ మంగళవారం రెవెన్యూ భవన్‌లో కల్పనకు రూ.2 లక్షల ఆర్థిక సాయం చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీ దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు సీఎం తక్షణ ఆర్థికసాయం

బెళుగుప్ప: ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి జగన్ సర్కార్ అండగా నిలిచింది. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం అందించడమే కాక, వారి చదువులకు భరోసా కల్పించింది. వివరాలు... బెళుగుప్ప మండలం నక్కలపల్లిలో ఈ నెల 2న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో రైతు దంపతులు ఈశ్వరరెడ్డి, సువర్ణమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. అదే రోజు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాలకు నివాళులర్పించిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతూ.. అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. ఈ క్రమంలో ఇటీవల కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎదుట రైతు దంపతుల కుమార్తె సుమనశ్రీ, కుమారుడు పునీత్‌కుమార్‌రెడ్డిని ప్రవేశపెట్టి, జరిగిన దారుణాన్ని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం వైఎస్ జగన్.. అమ్మాయికి రూ.5 లక్షలు, అబ్బాయికి రూ.3 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేయడంతో పాటు వారి చదువులకు తోడ్పాటునందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఉదయం తహసీల్దార్ ఓబులేసు, ఎంపీపీ పెద్దన్న, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, సర్పంచ్ రామిరెడ్డి, గ్రామస్తులతో కలసి నక్కలపల్లి గ్రామంలోని రైతు ఇంటికి వెళ్లి రూ.8 లక్షల విలువైన రెండు చెక్కులను చిన్నారులకు వారి అవ్వతాతల సమక్షంలో అందజేశారు. తక్షణమే స్పందించిన సీఎం వైఎస్ జగన్‌కు, కుటుంబానికి అండగా నిలిచిన విశ్వేశ్వరరెడ్డికి ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులతో పాటు, గ్రామస్తులూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్ : అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఖాజామొయిద్దీన్ కుటుంబానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు అండగా నిలిచారు. రూ.4,41,600 విలువ చేసే చెక్కును మృతుడి భార్య రహిమున్నీసా బేగం మంగళవారం అందజేశారు. సహచర ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలన్న సంకల్పంతో జిల్లాలోని హోంగార్డులు తమ జీతంలోని ఒక రోజు వేతనాన్ని ఇవ్వడాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ మగ్బూల్, తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతో మెరుగైన సమాజం

• జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



ర్యాలీ ప్రారంభిస్తున్న గిరిజమ్మ

అనంతపురం క్రైం: జనాభా నియంత్రణతోనే మెరుగైన సమాజం సాధ్యపడుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. జనాభా నియంత్రణతో పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. అందరి సంతోషం, శ్రేయస్సు కోసం జనాభా నియంత్రణ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతపురం నగర డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. జనాభా పెరుగుదల అనర్థాలకు దారి తీస్తుందన్నారు. చిన్న కుటుంబం అన్ని రకాలుగా మంచిదని, ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జనాభా నియంత్రణపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, పద్మావతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం ఆరోగ్యశాఖలో నిర్వహించిన సమావేశంలో కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురోగతి సాధించిన వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను డీఎంహెచ్‌ఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, డెమో ఉమాపతి, సిబ్బంది త్యాగరాజు, గంగాధర్, వేణు, వెంకటేశులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో పట్టపగలే చోరీ!

• రూ.80 వేలు అపహరణ



బ్లేడ్‌తో కట్ చేసిన సంచిని చూపిస్తున్న సావిత్రమ్మ

గుంతకల్లు టౌన్: స్థానిక కెనరా బ్యాంక్ (పాత సిండికేట్)లో పట్టపగలే చోరీ జరిగింది. బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలి సంచి నుంచి నగదును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితురాలు తెలిపిన మేరకు... గుంతకల్లులోని భాగ్యనగర్‌కు చెందిన దాసరి సావిత్రమ్మ ఇటీవల చీటీ పాడగా రూ.80 వేలు వచ్చింది. ఈ మొత్తాన్ని కెనరాబ్యాంక్‌లోని తన ఖాతాలో జమ చేసేందుకు మంగళవారం ఉదయం కూతురు ఉమాదేవితో కలసి బ్యాంక్‌కు చేరుకుంది. డిపాజిట్ ఫారమ్ భర్తీ చేస్తున్న సమయంలో సావిత్రమ్మ వద్ద ఉన్న సంచిని దుండగులు బ్లేడ్‌తో కత్తిరించి అందులో ఉన్న రూ.80 వేలు అపహరించుకెళ్లారు. కొన్ని క్షణాల్లోనే సంచిలోని డబ్బు మాయం కావడంతో బాధితురాలి రోదనకు అంతులేకుండా పోయింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు బ్యాంకులోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఓ మహిళతో పాటు మైనర్ బాలిక చోరీకి పాల్పడినట్లుగా నిర్ధారించుకుని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా రజక ఉద్యోగుల విద్యావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగనాథ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతిలో 500కు పైగా మార్కులు, ఇంటర్మీడియట్ సైన్స్ గ్రూపులో 850, ఆర్ట్స్ గ్రూపులో 750 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 94918 71141, 94405 01188లో సంప్రదించవచ్చు.

బుగ్గరామలింగేశ్వరుని సన్నిధిలో సాయికుమార్



ఆలయ అర్చకులతో నటుడు సాయికుమార్

తాడిపత్రి అర్బన్: ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను, శేష వస్త్రాలను, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మృత శిశువు



పరిశీలిస్తున్న వైద్యులు, సిబ్బంది

తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని అంబులెన్స్ వాహనాల మధ్య మంగళవారం ఉదయం మృతశిశువు లభ్యమైంది. పరిశీలించిన వైద్యులు.. సుమారు నాలుగు నుంచి ఐదు నెలల గర్భస్థ శిశువుగా నిర్ధారించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణికి అబార్షన్ జరిగి, శిశువు బయటపడి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, మృతశిశువును ఖననం చేయకుండా డస్ట్‌బిన్‌లో పడేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమివ్వకుండా గుట్టుగా ఉంచడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి సిబ్బంది అబార్షన్ చేసి మృత శిశువును అక్కడ పడేసినట్లుగా వదంతులు వ్యాపించాయి.

విద్యుత్ ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్

అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు సొసైటీ అధ్యక్షుడు బషీర్ అహమ్మద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22న నామినేషన్ల స్వీకరణ, 23న పరిశీలన, 24న విత్‌డ్రాలు, 30న పోలింగ్ ప్రక్రియ ఉంటాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,900 మందికి పైగా సభ్యులుగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

దమ్ముంటే 175 స్థానాల్లో అభ్యర్థులను బరిలో దించు

• పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్



వజ్రకరూరు: దమ్ము, ధైర్యం ఉంటే రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం వజ్రకరూరుకు వచ్చిన ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లను అవమానించేలా పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సినిమా షూటింగ్‌లు లేని సమయంలో మాత్రమే ప్రజల్లోకి వచ్చే పవన్ కళ్యాణ్‌కు వలంటీర్ల వ్యవస్థ గురించి ఏ మాత్రం అవగాహన లేదన్నారు. కేవలం ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదన్నారు. తాను అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పాల్సింది పోయి.. చంద్రబాబు మెప్పు కోసం జగన్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్న పవన్ కళ్యాణ్‌ను చవట దద్దమ్మగా ఇప్పటికే ప్రజలు గుర్తించారన్నారు. చంద్రబాబు హయాంలో సాగిన దోపిడీ పాలనపై నోరు విప్పని పవన్ కళ్యాణ్ కేవలం టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకే ప్రయత్నిస్తూ జనసేనను నమ్ముకున్న వారిని సైతం మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. సమావేశంలో ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శి నల్లబోతులరాజు, ఆదర్శ పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ఓ రాజకీయ అజ్ఞాని



విలేకరులతో మాట్లాడుతున్న గిరిజమ్మ

కూడేరు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఓ రాజకీయ అజ్ఞాని అని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ విమర్శించారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న వలంటీర్ వ్యవస్థను దెబ్బతీసేందుకే కుట్ర పన్ని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం కూడేరు పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సైతం వలంటీర్లను అవహేళన చేస్తూ మాట్లాడి అభాసు పాలయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం అదే బాటలో పర్సెంటేజీల స్టార్ పవన్ కళ్యాణ్ నడుస్తూ వలంటీర్లను కించపరిచేలా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి వలంటీర్ల సేవలను చూస్తే వలంటీర్ వ్యవస్థ ఎందుకో దత్తపుత్రుడికి అర్థమతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగన్ సర్కార్‌పై పథకం ప్రకారం దుష్ప్రచారం సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలు సమస్యలతో విలవిల్లాడుతుంటే ఆ రోజు ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్, ఎల్లోమీడియా ఎన్ని కుట్రలు పన్నినా ప్రజా మద్దతు సంపూర్ణంగా ఉన్న వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, వ్యవసాయ సలహా మండలి మండల చైర్‌పర్సన్ నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు తుప్పటి హరీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదులో తాత్సారం

• 'సమగ్ర' సిమెంటు దొంగల వ్యవహారంలో పోలీసుల మీనమేషాలు

రాప్తాడురూరల్: ఒకటికాదు రెండు కాదు.. దాదాపు 70 లోడ్ల ప్రభుత్వ సిమెంటు పక్కదారి పట్టింది. సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన ఈ దందాపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్లు గౌతమి, అరుణ్‌బాబు స్పందించి వెంటనే డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశాలిస్తూ, బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. స్వయంగా ఇద్దరు కలెక్టర్లు ఆదేశించి రెండు వారాలవుతున్నా పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికీ ఎఫ్ఐఆర్ కాలేదు. సూత్రధారులను తప్పించేందుకే కేసు నమోదులో తాత్సారం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

అసలేం జరిగిందంటే...

సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈఈ, డీఈల పేర్లతో లాగిన్లు ప్రారంభించి వాటిద్వారా శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనుల పేరుతో యథేచ్ఛగా సిమెంట్‌ను బుక్ చేస్తూ వచ్చిన లోడ్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. 64 ఇండెంట్లతో సుమారు 2 వేల టన్నుల సిమెంట్ బుక్ చేశారు. ఇందులో 500 టన్నుల దాకా కాంట్రాక్టర్లకు చేరినా...తక్కిన 1500 టన్నుల సిమెంటు పక్కదారి పట్టింది. ఈ వ్యవహారం డిపార్ట్‌మెంట్ అధికారుల దృష్టికి వచ్చినా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. సిమెంట్ దొంగల నిర్వాకాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. వరుస ప్రత్యేక కథనాలు ఉమ్మడి జిల్లాలో ప్రకంపనలు సృష్టించాయి. రెండు జిల్లాల కలెక్టర్లు స్పందించి విచారణకు ఆదేశించారు. ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తప్పించారు. అయితే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రం సంబంధిత అధికారులు నేటికీ ఇవ్వలేదు. మరోవైపు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశించినా...అది కూడా ఇప్పటిదాకా ఒక్క అడుగూ ముందుకు సాగలేదు. పరిణామాలు పరిశీలిస్తుంటే..దీని వెనుక ఎవరో బలమైన వారి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమతున్నాయి.

ఈకేవైసీ నమోదులో వెనుకబాటుపై కలెక్టర్ సీరియస్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధికి సంబంధించి రైతులతో ఈకేవైసీ చేయించడంలో అనంతపురం జిల్లా వెనుకబడిందనే అంశంపై ఈ నెల 9న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఎం.గౌతమి స్పందించారు. క్షేత్రస్థాయి అధికారుల నిర్లిప్తతపై వ్యవసాయశాఖ అధికారుల మీద ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఈ నెల 25వ తేదీ వరకూ ఆర్బీకేల వారీగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టి ఈకేవైసీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. కేంద్రం త్వరలోనే విడుదల చేయనున్న 14వ విడత పీఎం కిసాన్ సొమ్ము జమ కావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ ఉండాలనే నిబంధన విధించిన విషయం తెలిసిందే. దీంతో గతేడాది నుంచి రైతులు ఈకేవైసీ చేయించుకుంటున్నా... ఇంకా 38 వేల అకౌంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తేలింది. అటు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోనూ 48వేల అకౌంట్ల వరకు పెండింగ్‌లో ఉండడంతో రాష్ట్ర స్థాయి పెండింగ్ జాబితాలో ఉమ్మడి 'అనంత' జిల్లా మొదటి స్థానంలో నిలిచింది.

VicenteFerrer
Rural Development Trust

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా :
ఆర్.డి.టి. హాస్పిటల్, బత్తలపల్లి నందు 01-04-2011 నుండి 31-12-2017 వరకు చికిత్స పొందిన రోగుల మెడికల్ రికార్డ్స్ (OP & IP) ఫైల్స్ కోసం నిర్ణిత నిలువుదల వ్యవధి పూర్తి అయిన కారణంగా వాటిని నిర్వీర్యం చేయబడుచున్నవి. ఇది రిటెన్సన్ ఫిజికల్ రికార్డుల కోసం అక్రిడిటేషన్ నిబంధనల సబ్జెక్టుల (రిజిస్టర్డ్ పేషంట్లు) హాస్పిటల్ విధానాల ప్రకారం చేయబడుచున్నది. ఈ కాలంలో వైద్య సేవలను పొందిన వారు దీనిని గమనించి కోరుతున్నాము. ఈ ప్రకటన ప్రచురించిన 30 రోజుల తర్వాత చింపడం ద్వారా ఫైళ్లను నిర్వీర్యం చేసే ప్రక్రియ చేపట్టబడుతుంది. ఇన్సూరెన్స్ క్లెయిములు మరియు ఇతర రీయంబర్స్మెంట్ తో సహా ఏదైనా ప్రయోజనం కోసం డిశ్చార్జ్ సారాంశం మరియు విచారణ నివేదికలు అవసరమైన వారు ఆ విషయాన్ని హాస్పిటల్ అథారిటీ దృష్టికి తీసుకురావాలి. ఈ ప్రకటన వెలువడిన 30 రోజుల తర్వాత డిశ్చార్జ్ సారాంశం మరియు విచారణ నివేదికలు కోసం వచ్చే అభ్యర్థనలు స్వీకరించ బడవు మరియు ఆమోదించబడవు.

ఇట్లు : మెడికల్ డైరెక్టర్, ఆర్.డి.టి. హాస్పిటల్, బత్తలపల్లి.

ఆర్.ఓ.సి. నెం. 853/2023/A1
పురపాలక సంఘం, రాయదుర్గం
తేది : 11-07-2023

వేలం నోటీసు

రాయదుర్గం మునిసిపల్ కౌన్సిలు వారి తీర్మానం నెం.315 తేది : 31-03-2023 ననుసరించి సమగ్ర చిన్న మరియు మధ్య తరహా పట్టణా అభివృద్ధి పథకం క్రింద పాత బస్టాండు ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ నందు మొదటి అంతస్తులో A & B బ్లాక్ నిర్మించబడిన 42 షాపురూములు గుడ్‌విల్ (తిరిగి వాపసు ఇవ్వబడని) నాన్ రీఫండబుల్ మొత్తములకు తేది : 18-07-2023 మంగళవారం ఉదయం 11-00 గంటలకు మున్సిపల్ ఆవరణలో బహిరంగ వేలం వేయబడునని తెలియజేయడమైనది. షాపు రూములకు సంబంధించిన వివరములు ఆఫీస్ పనివేళలందు తెలుసుకొనవలెను.

క్రమ సంఖ్య	షాపు నెం.	షాపు యొక్క ప్లింత్ ఏరియా స్కుయర్	గుడ్ విల్ అమౌంట్	రూము అద్దె	సాల్వెన్సీ సర్టిఫికేట్
1.	A బ్లాక్ మొదటి హాలు 1 (5.8 x 11.50)	66.70	రూ.5,00,000.00	రూ.15,000.00	రూ.3,00,000.00
2.	A బ్లాక్ రెండవ హాలు 2 (12.50 x 11.50)	143.75	రూ.10,00,000.00	రూ.35,000.00	రూ.3,00,000.00
3.	A బ్లాక్ నందు 15 (5.80 x 3.30) షాపురూములు	287.1	రూ.1,50,000.00	రూ.5,000.00	రూ.3,00,000.00
4.	B బ్లాక్ నందు 25 (5.80 x 3.30) షాపురూములు	478.5	రూ.1,50,000.00	రూ.5,000.00	రూ.3,00,000.00
	మొత్తము షాపులు 42	976.05	రూ.75,00,000.00		

సం/- కమిషనరు, రాయదుర్గం పురపాలక సంఘం

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Tech/B.Pharmacy

■ AP EAPCET లో క్వాలిఫై అయితే ఫ్రీ ఎడ్యుకేషన్, క్వాలిఫై కాకుంటే హాస్టల్ ఫీజుతో B.Tech., B.ఫార్మసీ చదివే అవకాశం. Q: ఇంటర్, MPC/BiPC. # సంప్ర: జి. మురళీ, 9030661651, ATP. [A-2580]

MLT/MPHW ADMISSIONS

■ 10Th పాస్/ ఇంటర్ ఫెయిల్ స్టూడెంట్స్ కి MLT (బ్లడ్ టెస్ట్ కోర్స్),MPHW (నర్సింగ్ కోర్స్) కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ హాస్టల్ వసతి కలదు. Cont:8121661651, ATP. [A-972]

ఒకే సంవత్సరంలో ఇంటర్

■ దూరవిద్య ద్వారా 10th to PG, Aposs ద్వారా 10th, ఒకే సం॥లో ఇంటర్, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా డిగ్రీ / పిజీ, శ్రీ సత్యసాయి కోచింగ్ సెంటర్, రాంనగర్, ATP. Cell: 7396397396. [A-948]

DMLT ADMISSIONS

■ DMLT (Lab Technician) - 2 years. Paramedical Course. Eligible: Any Inter. SEEDS COLLEGE, ATP. Cell: 9440255034, 8897761840. [A-776778]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1487]

DISTANCE EDUCATION

■ AU, ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఓపెన్ 10th & ఇంటర్, B.A., B.Com, B.Sc (TM / EM) (All Groups), MA, M.Com, M.Sc (All Subjects), MSW, B.L.I.sc, M.L.I.sc & (Regular B.Ed Seats) వివరాలకు డా.బి.మధుసూధన : 83282 79245. [V- 6189]

REAL ESTATE

విల్లాస్ - బాడుగకు

■ TOLET : ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించబడిన ప్రముఖ రేణుక గేటెడ్ కమ్యూనిటీ నందు అన్ని వసతులతో, కొన్ని విల్లాస్‌లు ఖాళీగా ఉన్నవి. సంప్ర : 9000856501, ATP. [A-969]

PLOT FOR SALE

■ అనంతపురం టౌన్‌కు దగ్గర్లో, బ్రాహ్మణపల్లి వద్ద, స్కంద వెంచర్ నందు, సాయికుటీర్ - A బ్లాక్ నందు ప్లాట్ నెం. 127, సౌత్+వెస్ట్ కార్నర్ ప్లాటు, మొత్తం 4.5 సెంట్లు అమ్మకమునకు కలదు. డైరెక్టుగా సంప్ర॥ 7989224554. [A-965]

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2406]

WANTED

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు గవర్నమెంట్ ఆఫీసుల పనులు చేయుటకు మేనేజర్ కావలెను. అనుభవంగలవారికి ప్రాధాన్యత. సెల్ : 8309781667. [A-776777]

■ Wanted Teachers. Wanted Qualified Teachers to Teach Physics, Hindi for High School, English, Social for Primary Classes in Little Flower E.M School, ATP 9949083624. [A-975]

■ గుంతకల్ పట్టణంలోని ప్రముఖ బ్యాంక్ ఏటీఎమ్‌లో సెక్యూరిటీ గార్డు కావలెను. చదువు: టెన్త్, పనివేళలు: 12 గంటలు, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ. సౌకర్యం కలదు. వివరాలకు: ఫీల్డ్ ఆఫీసర్ 94940 32399. [L-798747]

■ అనంతపురం నందు HP గ్యాస్ లారీలు నడుపుటకు HMV లైసెన్స్ కలిగిన హజాదస్ డ్రైవర్లు కావలెను. నెలకు 20 వేల-30 వేల పైన (జీతం+ బత్త) 9515151065, 7780715154. [L-798744]

■ TTD నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ Staff కావలెను, జీతం: 10,000 + PF + ESI + Bus Pass, M/F, Age: 45 లోపు, 7997945161, 8297797197. [T-4425]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. హైదరాబాద్ Ph: 9640258899, విజయవాడ Ph:9640648899 [H-189305]

■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి + భోజనం, VJA ✆ 91608 35559, 78158 35561. [B-183]

■ సిమెంట్ ఫ్యాక్టరీలలో అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం:16వేలు,రూం ఫ్రీ, భోజనం తక్కువ రేటు. సంప్ర॥ పవన్ సెక్యూరిటీ సర్వీస్, బస్టాండ్,గుంతకల్లు.8464835828, 9573131699 [Y- 784370]

■ ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ యువకులకు అవకాశం కలదు. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 30. నో ఫీజు. సెల్: 9177342337. [WA-6998]

■ ప్రముఖ కంపెనీ యొక్క పార్ట్‌నర్స్ ప్రోగ్రామ్ చేయుటకు ఫీల్డ్ ఎంప్లాయీస్ కావలెను. & కంపెనీ మండలాల వారీగా ఫ్రాంఛైజెస్ కోసం. సంప్ర : 8125933546. [A-776773]

■ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనంతపురము జిల్లాలో PVC పైప్స్ & ఫిట్టింగ్స్, శానిటరీవేర్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు 1 సం॥ అనుభవం కలిగిన 30 సం॥లోపు వయస్సు కలిగిన యువకులు కావలెను. అర్హతకు తగ్గ జీతంతో పాటు TA & DA ఇవ్వబడును. Cont : 9652373785. [A-967]

■ WANTED : (1) FRUITS & Vegetable procurement Incharge (2 years experience) - (2) cold storage plant Operators (ITI-Electrical) @ Fresh Cart Agro (P) LTD, Kld Road, ATP (Interview : 15/07/2023). Cell : 8143697965. [A-986]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422 [H-189266]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సింగంపల్లిలో బోనాల జాతర


బోనాలు తీసుకెళ్తున్న సింగంపల్లి గ్రామస్తులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామంలో గ్రామస్తులు పోలేరమ్మ దేవతకు మంగళవారం బోనాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆషాఢమాసంలో మూడు మంగళవారాలు పోలేరమ్మకు బోనాలు ఎత్తుకెళ్లడం గ్రామ సాంప్రదాయమన్నారు. మూడో మంగళవారం కావడంతో గ్రామంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మొదటగా గ్రామంలో ఉన్న బొడ్రాయికి 101 బిందెలతో నీరు పోశారు. అనంతరం పోలేరమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి పూజలు చేశారు.

వేంకటేశ్వర వైభవం అభినందనీయం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న వేంకటేశ్వర వైభవం కార్యక్రమం మరింత భక్తిభావాన్ని నింపుతుందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో అనంత వేదికగా సాగే వేంకటేశ్వర వైభవం పోస్టర్లను ఆవిష్కరించారు. సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్ కుమార్ కార్యక్రమ వివరాలను వివరించారు.

రేపు రుక్మిణీ పాండురంగ స్వామి నిజ రూపదర్శనం


రుక్మిణీ, విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామ్‌నగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగ ఆలయంలో ఈనెల 13న నిజరూపదర్శన సేవలు జరుగుతాయని భావసార క్షత్రియ సమాజ్ ప్రతినిధులు ఆనంద్ మహేంద్రకర్, దుస్తకర్ తిరుపతిరావు తెలిపారు. మంగళవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆషాఢమాస తొలిఏకాదశి నాడు లాంఛనంగా నిజరూప దర్శనం ఆరంభించామన్నారు. ఇకపై ఏకాదశి నాడు స్వయంగా దేవతామూర్తులను తాకి ఆశీస్సులందుకునే విధంగా భక్తులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు.

శాకాంబరిగా దుర్గమ్మ దర్శనం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్: సాయినగర్‌లోని కనక దుర్గ అమ్మవారు ఆషాఢమాస మంగళవారం శాకాంబరిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి గాజుల అలంకరణ, ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలంకరణ, వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు సామూహిక లలిత సహస్ర నామాలు పఠించారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించండి


బ్రాంచి-2లో మాట్లాడుతున్న 'లియాఫీ' నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: ఎల్‌ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్రం, యాజమాన్యం చొరవ తీసుకోవాలని ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బ్రాంచి-1 కార్యాలయంలో వేణుగోపాల్, ప్రభాకర్ నాయుడు, తిరుపతయ్య, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. బ్రాంచి-2 కార్యాలయంలో జంపాల కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జయభారత్ రెడ్డి, వన్నూర్‌వలీ, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు. మెడిక్లెయిమ్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచాలని, జీఎస్టీ తీసేయాలని, పాలసీదారులకు బోనస్ పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ పరమావధి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వేణుగోపాల్‌నగర్, రాంనగర్, బుడ్డప్పనగర్‌లలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే 'అనంత' అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పవన్ కళ్యాణ్ మూర్ఖుడిలా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. పథకాలను ప్రజలకు చేరవేస్తూ స్ఫూర్తిదాయక సేవలందిస్తున్న వలంటీర్లను హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారని వ్యాఖ్యానించడం దారుణమన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం :

గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో 99 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చినట్లు ఎమ్మెల్యే అన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో పని చేసి ప్రతి సమస్యకూ పరిష్కారం చూపాలన్నారు. 11 రకాల సేవలతో పాటు మిగిలిన వాటిని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలన్నారు. నగరంలో 23 వేల మందికి ఇళ్ల పట్టాలను అందించామని, అందులో ఆలమూరు, కొడిమి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టేలా చర్యలు తీసుకుందన్నారు. కామారుపల్లి, ఉప్పరపల్లి (కోర్టు కేసు) లేఅవుట్ లబ్ధిదారులకు మరో అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గపోరుతో అభివృద్ధిని విస్మరించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, నాగమణి, లీలావతి, జయమ్మ, పాల్గొన్నారు.


జగనన్న సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం జరుగుతోందని ఎంపీపీ హేమలత తెలిపారు. మంగళవారం మండలంలోని మదిగుబ్బ గ్రామంలో ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు ఉన్న వారు అధికారుల దృష్టికి వచ్చిన వారికి సమస్యలు పరిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ షర్మిల, మదిగుబ్బ సర్పంచ్ నరసింహులు (దాదా), ఎంపీటీసీ లక్ష్మిదేవి, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, మండల కన్వీనర్ బాలపోతన్న, సచివాలయాల మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, అతికిరెడ్డి తదితర అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సురక్ష

రాప్తాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గొందిరెడ్డిపల్లి గ్రామంలో ఎంపీపీ జయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి, వారికి తక్షణమే అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ హేమలత

74 వేల క్వింటాళ్ల పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: మండలాల పరిధిలో 85 వేల మంది రైతులకు మంగళవారం నాటికి 74 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. వీటితో పాటు మినీకిట్ల రూపంలో కందులు, రాగులు, కొర్రల ప్యాకెట్లు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. జనరల్ సీడ్ కింద 30 శాతం రాయితీతో విత్తన కందులు, 50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు, పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే విత్తన పంపిణీ ముగించనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం అగ్రికల్చర్: నగరంలోని పలు ఎరువుల అంగళ్లను వ్యవసాయశాఖ అనంతపురం డివిజన్ ఏడీ ఎం.రవి, రూరల్ ఏఓ శశికళ మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్, సేల్స్, బిల్లు బుక్కులు, లైసెన్సులు పరిశీలించారు. ఎస్‌ఎంఆర్ ఫర్టిలైజర్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా ఉంచిన రూ.1.39 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. 21 రోజుల్లోపు సంబంధిత రికార్డులు అందజేస్తే ఎరువుల అమ్మకాలకు అనుమతిస్తామని, లేకుంటే వాటిని సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు అమ్మినా, రైతుల నుంచి ఫిర్యాదులు అందినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఈనెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సనప గ్రామంలో -3, తలుపూరు- 1, తోపుదుర్తి -1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 18,19వ తేదీల్లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

'బాబు మాటలు నమ్మే పరిస్థితి లేదు'

అనంతపురం సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మోసగాడని, ఆయన మాటలు నమ్మే పరిస్థితి లేదని అనంతపురం నగర మేయర్ వసీం , వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరుల ఎదుట ముస్లింలు, ముస్లిం మత పెద్దలు అన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని మసీద్ ఏ యూసఫ్ ఏ మసీదులో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను మత పెద్దలతో కలసి విడుదల చేశారు. ఇందులోని పథకాలన్నీ మీకు వర్తిస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. కేవలం ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చంద్రబాబు చూస్తున్నాడని, ఆయన పాలనలో ఒక్క ముస్లింకూ మంత్రి పదవి ఇవ్వకపోవడాన్ని తాము మరచిపోలేమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ముతవల్లి అమీర్, ఇమామ్ ఫక్రుద్దీన్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మత పెద్దలతో కలసి బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్ భాగ్యలక్ష్మి

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో కమిషనర్ సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు పురోగతిపై కమిషనర్ ఆరా తీశారు. పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజినీర్లు మరింత చిత్తశుద్ధితో పని చేయాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం, ప్యాచ్ పనులు, పూడికతీత పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సతీష్‌చంద్ర, ఈఈ చంద్రశేఖర్, డీఈలు రాంప్రసాద్ రెడ్డి, దాక్షాయని, శేఖర్, ఏఈ బాబావలి, ఉమామహేశ్వరి, శంకర్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేద్దాం

రాప్తాడు: ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణకు కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వైద్యాధికారి శ్రావణి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది జనాభా నియంత్రణపై ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ జనాభా పెరుగడం వలన పేదరికం, నిరుద్యోగం, ఆహార సమస్య, ఆరోగ్య సమస్యలు, పర్యావరణ, వనరుల క్షీణత, సామాజిక అసమానతలు తలెత్తుతాయని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణమ్మ, లక్ష్మీనరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మీన, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని వైద్యసిబ్బంది ప్రజలకు తెలియజేశారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని బి.యాలేరు గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య మాట్లాడుతూ ఒకరు లేదా ఇద్దరు పిల్లలు ఉంటే కుటుంబ ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


రాప్తాడులో బస్టాండ్ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది

ప్లాస్టిక్ బ్యాగు పడేద్దాం..ఎనీటైం బ్యాగు వాడదాం


బ్యాగ్ కోసం యంత్రంలోకి కాయిన్లు వేస్తున్న మహిళ

అనంతపురం టౌన్: రోజువారి జీవన విధానంలో ప్లాస్టిక్ వాడకం సర్వసాధారణమైంది. మార్కెట్‌లో ఏ చిన్న వస్తువును కొనుగోలు చేసినా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని మనిషి జీవన ప్రమాణాలు పెంచే దిశగా కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక అడుగులు వేస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటు ప్రజలు అటు మూగజీవాలు కూడా అనారోగ్యం బారిన పడుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగం తగ్గకపోతే రాబోవు రోజులు మరింత దుర్భరంగా మారే అవకాశం ఉంది.ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తి స్థాయిలో తగ్గించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నగరంలోని పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో ఎనీటైం బ్యాగ్‌ను అందించే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.10 కే నాణ్యమైన జూట్ బ్యాగ్‌ను అందిస్తున్నారు. రూ.10 నోటుతో పాటు రెండు రూ.5 కాయిన్లు వేసినా యంత్రం నుంచి బ్యాగ్ వస్తుంది. ఏటీబీ యంత్రానికి డిజిటల్ స్కానర్ ఏర్పాటు చేయడంతో మరింత సౌకర్యంగా ఉంది.

డ్రాగా ముగిసిన మూడో రౌండ్ మ్యాచ్‌లు

అనంతపురం: అంతర జిల్లా సీనియర్ క్రికెట్ మల్టీడే టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం మూడో రౌండ్ మూడో రోజు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అనంతపురం- నెల్లూరు, కడప -కర్నూలు జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. మూడు మ్యాచ్‌లూ డ్రాగా ముగియడం విశేషం.

- అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 374 పరుగులు చేసింది. అనంతపురం జట్టు ఇన్నింగ్స్‌లో 276 పరుగులు చేసింది. ఎంకే దత్తా రెడ్డి 56 పరుగులు, జి. సంపత్ కుమార్ 29 పరుగులు, షోయబ్ మహమ్మద్ ఖాన్ 27 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించారు. నెల్లూరు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. కే నిఖిలేశ్వర్ 51 పరుగులు, రేవంత్ రెడ్డి -71 పరుగులు చేశారు.
- కడప-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 420 పరుగులు చేసింది. కడప జట్టు మొద టి ఇన్నింగ్స్‌లో 231 పరుగులు చేయగా, కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 360 పరుగులు చేసింది. కర్నూలుకు చెందిన బ్యాటర్ యుఎంఎస్ గిరినాథ్ 136 పరుగులు చేశారు. మ్యాచ్ డ్రాగా ముగియగా, కర్నూలు ఒక ఇన్నింగ్స్ ఆధిక్యత కనబరిచింది.


యుఎంఎస్ గిరినాథ్

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే

రాప్తాడురూరల్: పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందేనని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం-1 పరిధిలోని వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్లను క్రిమినల్స్‌గా చిత్రీకరించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వలంటీర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సముచిత స్థానం ఇచ్చారన్నారు. రాజకీయంలో ఓనమాలు తెలియని పవన్‌కళ్యాణ్‌కు ఎందుకు రాజకీయాలు అని ప్రశ్నించారు. నోటికి ఏమొస్తే అది ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, బీసీ సెల్ నాయకులు వడ్డే శీనా, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సత్యనారాయణ, బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, ఎర్రిస్వామి, లాలెప్ప, వెంకటేష్, షామీర్, రమేష్, బయపరెడ్డి, రాజమ్మ, ప్రమీల, అలీ, రాజగోపాల్, రమేష్ పాల్గొన్నారు.


రాప్తాడు రూరల్: నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు


రాప్తాడు: ఎస్‌ఐ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అరెస్ట్ చేయాలని వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఎంపీపీ జయలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు ఆధ్వర్యంలో వలంటీర్లు నిరసన తెలియజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండు సర్కిల్‌కు చేరుకొని మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడి నుండి ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పవన్ కళ్యాణ్‌ను అరెస్ట్ చేయాలని ఎస్‌ఐ ఆంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. వలంటీర్లు, ఎంపీపీ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, అగ్రిబోర్డ్ చైర్మన్ కేశవ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, యూత్ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాధాన్య భవనాలు పూర్తి చేయండి

- పీఆర్ డీఈఈ భాస్కర్ రెడ్డి ఆదేశం


మాట్లాడుతున్న పీఆర్ డీఈఈ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాచంరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశించారు. శింగనమల నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

యువతి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ జాకీర్ కొట్టాలకు చెందిన ఓ యువతి (18) అదృశ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. జాకీర్ కొట్టాలకు చెందిన ధనుంజయ దంపతులు కూలి పనులకు వెళ్లేవారు. వీరి కుమార్తె ఇంటర్ ఫెయిల్ అయి ఇంటి వద్దనే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం తండ్రి ఇంట్లో ఉన్న సమయంలో టైలర్ వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు కాలనీతో పాటు చుటుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లేకపోవడంతో మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి ఫిర్యాదు చేశాడు.

బెంగళూరు డీటీడీసీ క్లబ్ విజయం

అనంతపురం: న్యూజిలాండ్‌కు చెందిన వెల్లింగ్‌టన్ హాట్‌హాక్స్ సీనియర్ క్లబ్ టీం, బెంగళూర్‌కు చెందిన డీటీడీసీ క్లబ్‌కు సంబంధించి అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం టీ-20 మ్యాచ్ జరిగింది. ఇందులో బెంగళూర్‌కు చెందిన డీటీడీసీ క్లబ్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన డీటీడీసీ జట్టు 20 ఓవర్లకు గాను నాలుగు వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. డి. ధీరజ్ 66 పరుగులు, ఫయాజ్ అహమ్మద్ 40 పరుగులు ప్రతిభ చాటి గణనీయమైన స్కోరు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హాట్‌హాక్స్ జట్టు 20 ఓవర్లకు గాను 5 వికెట్లు కోల్పోయి, 144 పరుగులు మాత్రమే చేసి లక్ష్యాన్ని చేరుకోవడంలో తడబడింది. విల్ గ్రీన్ హుడ్ 29 బంతుల్లో 33 పరుగులు (ఒక ఫోర్, ఒక సిక్సర్) మాత్రమే చేశాడు. అభిషేక్ శెట్టి 22 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలకమైన వికెట్లు తీశాడు. రెండో మ్యాచ్‌లోనూ డీటీడీసీ 201 పరుగులు చేయగా, హాట్ హాక్స్ 189 పరుగులు చేసి ఓటమి పాలయ్యింది.


న్యూజిలాండ్‌కు చెందిన హాట్‌హాక్స్ క్లబ్ జట్టుకు స్వాగతం పలుకుతున్న ఆర్డీటీ సిబ్బంది

నేటి నుంచి పీజీ పరీక్షలు

అనంతపురం క్రైం: బోధనాస్పత్రిలో బుధవారం నుంచి ఈ నెల 18 వరకు ఫైనలియర్ పీజీ విద్యార్థులకు (2020 బ్యాచ్) పరీక్షలు జరగనున్నాయి. అందుకోసం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి నాయక్ ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్జరీ, ఎస్‌పీఎం, సైకియాట్రీ, పీడియాట్రిక్స్, ఓబీజీ, మెడిసిన్, అనస్తీషియా తదితర విభాగాల పరీక్షలు జరగనున్నాయి.

నేటి నుంచి రాష్ట్ర కమిటీ సమావేశాలు

అనంతపురం అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. నగరంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ చేశారు. కార్యదర్శులు ఆర్‌వీ నాయుడు, రామిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సమావేశాలకు పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేరళ మాజీ మంత్రి ఎంఏబేబీ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ మధు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ హాజరుకానున్నారన్నారు. నాయకులు ముస్కిన్, ముత్తుజ, నాగరాజు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓల అభివృద్ధికి తోడ్పాటు


పవర్ పాయింట్ ద్వారా అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓ) ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్ లేకుండా తమవంతు ప్రోత్సాహం అందిస్తామని గ్రాంట్ థార్న్‌టన్ భారత్, ఇండోఫిల్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో ఎఫ్‌పీఓల సాధికారత సదస్సు నిర్వహించారు. ఏపీతో పాటు మరో ఐదు రాష్ట్రాలలో ఎఫ్‌పీఓల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రామాంజులు, హరిబాబు, వేణుగోపాల్, జయంత చక్రవర్తి, అంజిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 36 గంటల నిరసన కార్యక్రమం మంగళవారం ముగిసింది. సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే ఎక్కువ వేతనం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీ పెంచాలన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు శకుంతల, నాయకురాలు జమున, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, ప్రజాసంఘాల నాయకులు నల్లప్ప, రామాంజినమ్మ, బాలరంగయ్య పాల్గొన్నారు.

ఈసీటీ మిషన్ అందజేత

అనంతపురం క్రైం: ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామ్మోహన్, ఆయన సతీమణి ఉమామహేశ్వరి రూ.లక్ష విలువజేసే ఈసీటీ పరికరాన్ని జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగానికి మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రామస్వామి నాయక్, మానసిక వైద్య విభాగాధిపతి వైద్యనాథ్, వైద్యులు అనిల్, శశాంక్, వరదరాజులు, ఆలంబన జనార్దన్ పాల్గొన్నారు.